సాక్షి ఒడిశా
శనివారం । 7 । జూన్ । 2025

ఈదురుగాలులకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు



నరసన్నపేట: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలులకు పది విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. కొత్తపాలవలస సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలన్నీ వంగిపోయాయి. అలాగే దేవాది వద్ద 133 కేవీ లైన్‌కు సంబంధించిన విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో మండలంలోని దేవాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఒక పక్క ఉక్కపోత, మరోవైపు రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పర్లాకిమిడిలో మంత్రి రబి నారాయణ పర్యటన నేడు

పర్లాకిమిడి: రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ మంత్రి రబి నారాయణ నాయక్ శనివారం గజపతి జిల్లాలో పలు మెగా తాగునీటి సరఫరా ప్రాజెక్టులు పరిశీలించనున్నారు. అనంతరం కలెక్టరేట్లో ప్రభుత్వ శాఖల ఇంజినీర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం తిరిగి భువనేశ్వర్ వెళ్లనున్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భాస్కర, రాంజీ ఆచార్యులు

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర మందిరంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. అభిషేకాలు, సుప్రభాత సేవ, విశేష పూజలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్జల ఏకాదశిని పురస్కరించుకుని శ్రీరామా సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

20కి రథాల నిర్మాణం ప్రారంభించాలి



జయపురంలో తయారవుతున్న జగన్నాథ రథం

జయపురం: రథయాత్రకు 20వ తేదీలోగా రథ నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంతో రథాల పనులు జరుపుతున్నట్లు దేవాదాయ విభాగం సీనియర్ క్లర్క్ రథయాత్ర పర్యవేక్షకులు కృష్ణ చంద్ర దాస్ వెల్లడించారు. జయపురంలో రథ నిర్మాణం చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించారు. అక్షయ తృతీయ దినాన రథ నిర్మాణానికి పూజలు చేశామని వెల్లడించారు. జయపురం రథం పొడవు 44 అడుగులు ఉంటుందని తెలిపారు. శ్రీజగన్నాథ్, సుభద్ర, బలభద్రుల దేవతా మూర్తుల కోసం నిర్మిస్తున్న పెద్ద రథంతో పాటు పతిత పావనునికి చిన్నరథం తయారు చేస్తామని ఆయన వెల్లడించారు. అలాగే జయపురం సమితి బాట జగన్నాథ్‌పూర్ గ్రామం రథం కూడా ఇక్కడ తయారు చేయనున్నట్లు వెల్లడించారు. పలిగుడ వడ్రంగి ధనుర్జయ కమర, పనసపుట్‌భగర కముల కమరల నేతృత్వంలో మరో ఆరుగురు రథాలను తయారు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎలుగు దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు



కొట్‌పాడ్ గుమడ ప్రాంతంలో రైతుపై దాడి చేసిన ఎలుగుబంటి

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి గుమడ పంచాయతీలో ఒక రైతుపై ఎలుగుబంటి దాడి చేయగా ఆ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని రాధా చలాన్(60)గా గుర్తించారు. అందిన వివరాల ప్రకారం.. రాధా చలాన్ కొట్‌పాడ్ సమితి ప్రాంతంలో ఇంద్రావతి నది ప్రాంతంలో మొక్కజొన్న పంట వేశాడు. ప్రతిరోజూ అతడు మొక్క జొన్న పంటకు రాత్రిళ్లు కాపలా కాస్తుంటాడు. గురువారం రాత్రి కూడా తోటకు కాపలా కాశాడు. రాత్రి 4 గంటల సమయంలో అతడు నిద్రిస్తున్న సమయంలో సమీప చెరుకు మడి నుంచి ఒక ఎలుగు బంటి వచ్చి అతడిపై దాడి చేసింది. అతడి తల, ముఖంపై బలమైన గాయాలయ్యాయి. కేకలు విని పక్కన ఉన్న రైతులు రావడంతో వారిని చూసి ఎలుగు పారిపోయింది. తీవ్రంగా గాయపడిన రాధా చలాన్‌ను వెంటనే జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

మత సామరస్యానికి ప్రతీక బక్రీద్ : ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను కులమతాలకు అతీతంగా సోదరభావంతో శాంతియుతంగా జిల్లా ప్రజలు జరుపుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జగరకుండా అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. మసీదుల వద్ద ప్రశాంతంగా ప్రార్థనలు జరిగేలా, డ్రోన్స్, సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, గోవధ, పశువుల అక్రమ రవాణా చేసే వారి సమాచారాన్ని డయల్ 100, 112లకు, పరిధి పోలీస్ స్టేషన్లకు అందించాలన్నారు. సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామన్నారు.

పార్టీలో విభేదాల్లేవు

- పంచాయతీ ఎన్నికల్లో సత్తాచాటుకుంటాం
- బీజేడీ పార్టీ నేత, మాజీ మంత్రి ప్రమిలా మల్లిక్



ప్రసంగిస్తున్న ప్రమిల మల్లిక్, వేదికపై పద్మనాభ బెహర, నెక్కంటి తదితరులు

రాయగడ: బీజేడీ పార్టీలో ఎటువంటి విభేదాలు లేవని, రానున్న పంచాయతీ ఎన్నికల్లో తమ సత్తా చాటుకుంటామని మాజీ మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షురాలు ప్రమీల మల్లిక్ అన్నారు. జిల్లాలోని బిసంకటక్, రాయగడ, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిని సమీక్షించేందుకు శుక్రవారం ఆమెతో పాటు మాజీ మంత్రి పద్మనాభ బెహరలు రాయగడ వచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక తేజస్వీ హోటల్‌లో కార్యకర్తలు, సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసంగించారు. గత ఎన్నికల్లో బీజేపీ ఏదో చేసేస్తుందనే ఆశతో గెలిపించారన్నారు. ఆ పార్టీ సంవత్సర కాలంలో చేసిందేమిటో అందరికీ అర్థమైందన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. అధికారంలోకి వస్తే 300 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా వినియోగదారులకు ఇస్తామని హామీ ఇచ్చారని, అలాగే చిట్ ఫండ్ మోసాలకు గురైన బాధితులకు అండగా నిలుస్తామని ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా బీజేపీ నెరవేర్చలేదని అన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ప్రజలు విరక్తితో ఉన్నారని చెప్పారు. ముఖ్యంగా బీఎస్‌కేవై (బిజు స్వాస్థ్య కళ్యాణ యోజన పథకం)ను రద్దు చేసిన బీజేపీ ప్రభుత్వం యుష్మాన్ కార్డును ఇచ్చిందని.. అయితే ఈ కార్డు చూపిస్తే ఏక్కడా ఉచితంగా వైద్యం అందించడం లేదన్నారు. ప్రజలను మభ్యపెట్టి గెలిచిన ఆ పార్టీకి త్వరల్లో గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పంచాయతీ ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని మరోసారి నొక్కి చెప్పారు. కార్యకర్తలు ఎటువంటి నిరాశ చెందకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతా సైనికుల్లా కలసికట్టుగా పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో బీజేడీ పార్టీయే స్థిరమైనదన్నారు.

నెక్కంటి నేతృత్వంలో పార్టీ బలోపేతం..

సమావేశంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సీనియర్ కార్యకర్తలు, నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నెక్కంటి నేతృత్వంలో బీజేడీ ఈ జిల్లాలో మరింత బలోపేతం అవుతుందన్నారు. త్వరలో ప్రకటించనున్న బీజేడీ జిల్లా అధ్యక్షుడి పదవిని ఆయనకు ఇవ్వాలని కోరారు. పార్టీని ముందుకు నడిపించే సమర్థమంతమైన నాయకుడిగా అంచెలంచెలుగా ఎదిగిన నెక్కంటికి తిరిగి పగ్గాలు చేపట్టే విధంగా అధిష్టానం చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, అనసూయా మాఝి, మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక తదితరులు పాల్గొన్నారు.

పూర్వ వైభవాన్ని తీసుకువస్తాం

పార్టీని పూర్వవైభవాన్ని తీసుకువస్తామని అందుకు అంతా నిరంతరంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. మాయమాటలు చెప్పి అడ్డతోవలో వచ్చిన బీజేపీకి కాలం చెల్లిందని అన్నారు. అందువల్ల పార్టీ కార్యకర్తలు మరింత పట్టుదలతో పనిచేయాలని అన్నారు. త్వరలో జరగనున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీజేడీ పార్టీ తమ ఉనికిని చాటుకోవడం ఖాయమని అన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేడీ పార్టీ కార్యకర్తలు

మోదీ పాలనలో అభివృద్ధి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ముఖేష్



మొక్క నాటుతున్న మంత్రి డాక్టర్ ముఖేష్



మంత్రిని స్వాగతిస్తున్న కార్యకర్తలు

జయపురం: నరేంద్ర మోదీ పాలనలో భారత్ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని ఒడిశా ఆరోగ్య విభాగ మంత్రి డాక్టర్ ముఖేష్ ముహలింగ్ అన్నారు. ఆయన తన కొరాపుట్ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడలో పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ తన పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని, ఒడిశా సీఎంగా ఎన్నికైన మోహన్ కూడా చక్కని పాలన అందిస్తున్నారని తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా ఆయన మొక్కలు నాటారు.

భేషైన వేషధారణ



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డులో జరుగుతున్న గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ నగర్‌లో నిర్వహించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్థానిక మహిళలు, యువతీ, యువకులు పలు రకాల వేషాలు కట్టి అలరించారు. – కాశీబుగ్గ

50 వంట గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు



సీజ్ చేసిన సిలిండర్లను తరలిస్తున్న దృశ్యం

రాయగడ: సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గురువారం పలు హోటళ్లలో ఆకస్మిక దాడులను నిర్వహించింది. ఈ దాడుల్లో 50 వంట గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నియమాలను ఉల్లంఘించి కమర్షియల్ సిలిండర్లకు బదులు డొమస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్న 14 హోటళ్లలో దాడులను నిర్వహించి సిలిండర్లను సీజ్ చేశారు. జేకేపూర్, రాయగడలోని హోటళ్లలో విస్తృతంగా నిర్వహించిన ఈ దాడుల్లో ఏసీఎస్‌వో సుధాంశు భోయ్, పౌరసరఫరాల శాఖ రాయగడ సమితి ఇన్‌స్పెక్టర్ ప్రభంజన్ మహంతి, మున్సిపాలిటీ సిబ్బంది మహేంద్ర రాయ్ పాల్గొన్నారు.

డోలీలో ప్రయాణం.. దారిలో ప్రసవం



రెండు కొండలు దాటి గర్భిణి మహిళను మోసుకు వస్తున్న గ్రామస్తులు

జయపురం: డోలీలో ఓ గర్భిణిని మోసుకు వెళ్తుండగా దారిలో ప్రసవమైన ఘటన జయపురం సమితి రొండాపల్లి పంచాయతీ రామగడ గ్రామ సమీపంలో జరిగింది. ఆమె ఒక పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. కొండపై గల కెందుగుడ గ్రామంలో గురువారీ పొరజ నివాసం ఉంటున్నారు. ఆమెకు శుక్రవారం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆశ వర్కర్‌కు చెప్పడంతో ఆమె అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అయితే ఆ గ్రామానికి మార్గం లేక అంబులెన్స్ రాదని డ్రైవర్ తెలపటంతో గ్రామ ప్రజలు వెదురు బొంగలతో ఒక డోలీ కట్టి అందులో గర్భిణిని ఉంచి రెండు పర్వతాలు దాటించారు. ఆస్పత్రి మరో 3 కిలోమీటర్లు ఉందనగా.. గురువారీ పొరజకు ప్రసవమైంది. విషయం ఆశ వర్కర్ స్వర్ణలతకు తెలియజేసి తల్లీబిడ్డలను ఇంటికి తీసుకు వెలుతున్నట్లు తెలియజేశారు. స్వర్ణలత బైరాగి మఠం వద్ద వేచి ఉంది. అక్కడకు వచ్చిన బాలింతను ఆస్పత్రికి తీసుకెళ్దామని చెప్పినా వారు వినలేదు. గ్రామానికి రోడ్డు లేకపోవడంతో ఇలా డోలీలు, మంచాలపై రోగులను మోసుకుంటూ వెళ్లాల్సి వస్తోందని, రోడ్డు వేయాలని వారు కోరుతున్నారు.

పరిశ్రమల పేరిట ప్రకృతిని హరిస్తున్నారు

- పర్యావరణ వేత్త ప్రఫుల్ల సామంతరాయ్



ప్రసంగిస్తున్న ప్రఫుల్ల సామంతరాయ్



సమావేశానికి హాజరైన మహిళలు

రాయగడ: పరిశ్రమలు ఏర్పాటైతే అభివృద్ధి సాధ్యమని ప్రజలను మభ్యపెట్టి ప్రకృతి సంపదలను హరించివేస్తున్నారని పర్యావరణ వేత్త ప్రఫుల్ల సామంతరాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని కాసీపూర్ కొంటామాల్ మైదానంలో పృకృతిక సుర‌క్షా సమితి ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పృకృతిక సంపదలను ప్రైవేటు పరం చేస్తున్నాయని.. దీనిని కలిసికట్టుగా ఎదుర్కోగలిగితేనే మన సంపదలను కాపాడుకోవచ్చన్నారు. అందుకు అందరూ ముందడుగు వేయాల్సిన తరుణం ఆసన్నమైందని అన్నారు. రోజురోజుకూ పర్యావరణం సమతుల్యం అంచులు దాటిపోతున్న సమయంలో ఉన్న ప్రకృతి సంపదలను పోగొట్టుకుంటే భావితరాలు పర్యావరణ పరంగా తీవ్ర పరిస్థితులు ఎదుర్కోవల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాసీపూర్ ప్రాంతం ప్రకృతి సంపదలకు పుట్టినిల్లని.. వాటిని పోగొట్టుకుంటే మిగిలింది మనకు విష కాలుష్యమేనని భయాందోళన వ్యక్తం చేశారు.

పోలీసులు అడ్డుకుంటున్నారు..

పర్యావరణం కోసం పోరాడేందుకు వస్తే పోలీసులు అడ్డుకుంటున్నారని ఇది ఎక్కడి విడ్డూరమని సామంతరాయ్ ప్రశ్నించారు. కొంటామాల్‌లో జరగనున్న సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ప్రముఖ సమాజ సేవకురాలు, పర్యావరణ వేత్త మేధాపట్కేర్‌తోపాటు మరికొందరు ప్రముఖులను రాయగడలో పోలీసులు అదుపులోకి తీసుకుని వారిని తిరిగి పంపించివేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాసినట్లేనని అన్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో ప్రకృతిని హరించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. తమ ఆందోళనలను, పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మాలిసురక్షా సమితి అధ్యక్షుడు సుభా మాఝి మాట్లాడుతూ.. పర్యావరణం గురించి శాంతి యుతంగా ఆందోళనలు చేపడితే యంత్రాంగం అడ్డుకోవడం విచారకరమని అన్నారు. అయితే ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ఎన్ని అవరోధాలు ఎదురైనా తమ ఆందోళనలు కొనసాగించడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో పృకృతి సురక్షా సమితికి చెందిన దిగంబర్ దురియా, సురేష్‌రావు, శుభేంద్ర ములిక, సంగ్రామ్ కేసరి, సనాతన్ ప్రధాన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. సమితి పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పగలు బొమ్మల వ్యాపారం.. రాత్రి దోపిడీలు

- హైవేల్లో ఆగి ఉన్న వాహనదారులపై దోపిడీ
- చీకటిలో దోపిడీ దొంగల వీరంగం
- పోలీసులకు చిక్కిన నలుగురు దొంగలు, ఒకరు పరారీ
- రోడ్డు పక్కన గుడారాల్లో నివాసాలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వర రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : హైవే పక్కన గుడారాల్లో నివాసం .. పగలు బొమ్మల వ్యాపారం.. రాత్రయితే దోపిడీ.. విశాఖ జిల్లా తగరపువలస నుంచి మన జిల్లా ఇచ్ఛాపురం వరకు అంతా వీరి రాజ్యమే. జాతీయ రహదారి వెంబడి ఎక్కడైనా వాహనం ఆగి ఉంటే చాలు నగదు, మొబైళ్లు, పార్క్ చేసిన బైక్‌లు కూడా ఎత్తుకుపోతారు. జిల్లాలోనూ వీరి హస్తకళ చూపించారు. తాజాగా వీరిలో నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ మహేశ్వర రెడ్డి ఈ రాజస్థానీ దొంగల వివరాలను శుక్రవారం వెల్లడించారు.

ఆదాయం చాలక..

జిల్లాలోని రణస్థలం మండలం కోష్ట ప్రాంతంలో గత మూడేళ్ల నుంచి రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన ఆదిత్య పవార్ అలియాస్ వర్ధమ్ (22), అతని సోదరులు, మరికొందరు కుటుంబీకులు రోడ్డు పక్కన గుడారాల్లో నివసిస్తున్నారు. పగటి పూట బొమ్మలు, దుప్పట్లు అమ్ముకోవడమే వీరి జీవనాధారం. ఆ ఆదాయం సరిపోకపోవడం, ఇంటిల్లిపాదీ చెడు అలవాట్లకు బానిసలు కావడంతో రాత్రిపూట రోడ్డుపక్కన దొంగతనాలకు ఒడిగడుతున్నారు. ఆదిత్యనే ఈ గ్యాంగ్‌కు లీడర్. అతని సోద రులు బంగారం పవార్ (21), సుధీర్ పవార్ (19)లే కాక బావమరుదులు సంజు షిండే అలియాస్ పటేల్, మరో బాలుడు కూడా ఇదే పనిలో ఉన్నారు.

మూడేళ్లుగా ఎవరికీ చిక్కక..


అర్ధరాత్రి వేళల్లో ఆగి ఉన్న లారీలు, వ్యాన్లలో నిద్రిస్తున్న వ్యక్తుల వద్దకు వెళ్లి వారికి తెలియకుండానే నగదు, ఫోన్లను తస్కరించి అక్కడి నుంచి పరారయ్యేవారు. గత ఆరు నెలల నుంచి ఆగి ఉన్న వాహనదారుల వద్దకు వెళ్లి కత్తులతో బెదిరించి.. వారిని కొట్టి డబ్బు, మొబైళ్లు లాక్కోవడం మొదలుపెట్టారు. అదే వారిని పట్టించింది. ఆమదాలవలసకు చెందిన బొడ్డేపల్లి సతీష్‌కుమార్, అతని స్నేహితుడు సేపీన బెనర్జీలు తమ బైక్‌పై గత నెల 18న నందిగాం మండలం కణితూరు గ్రామంలో జరిగే వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి అదే రోజు అర్ధరాత్రి పయనమవ్వగా మార్గం మధ్యలో వర్షం కురవడంతో సరిగ్గా 12:50 గంటలకు టెక్కలి మండలం విక్రంపురం గ్రామం జేఎస్ బస్టాప్ (ఎన్‌హెచ్-16 సమీప) వద్ద ఆగి కాసేపు ఆగారు. పైన పేర్కొన్న నిందితుల్లో నలుగురు ఒక్క ఉదుటున వారివద్దనున్న కత్తులను తీసి సతీష్, బెనర్జీల గొంతుపై పెట్టారు. అంతటితో ఆగక పిడిగుద్దుల వర్షం కురిపించి ఏమేం ఉన్నాయో తీయండంటూ బెదిరించడంతో రూ. 6 వేల నగదు, రెండు మొబైళ్లు ఇచ్చేశారు. వెంటనే నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు టెక్కలి పోలీసులను ఆశ్రయించారు. అప్పటికే కొన్ని చోట్ల ఇలాంటి దొంగతనాలు జరుగుతుండటంతో ఎస్పీ కేవీ మహేశ్వరెడ్డి ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ ఎస్ఎస్ చంద్రమౌళి, టెక్కలి సీఐ విజయ్‌కుమార్ రెండు పోలీసు బృందాలుగా ఏర్పడి తీగ లాగారు.

ఎలా పట్టుబడ్డారంటే..

ఈ నెల 5న సాయంత్రం 6 గంటల సమయంలో టెక్కలి మండలం శ్యామసుందరాపురం గ్రామం జగదిమెట్ట ఫ్లై ఓవర్ సమీపంలో కొంతమంది అనుమానంగా రెండు ద్విచక్రవాహనాలపై సంచరిస్తున్న విషయం టెక్కలి ఎస్ఐ కె.మధుసూధనరావుకు తెలియడంతో సిబ్బందితో వెళ్లి నిందితులను పట్టుకున్నారు. వారిలో సంజు షిండే పరారయ్యాడు. వారి వద్ద నుంచి రూ.1,12,000 నగదు, రెండు ద్విచక్రవాహనాలు, ఎనిమిది మొబైళ్లు, ఆరు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించడం, జిల్లాలో పలుచోట్ల వారు చేసిన నేరాలు బయటపడ్డాయి.

ఎక్కడెక్కడ అంటే..

టెక్కలి, లావేరుల్లో ఒక్కొక్కటి చొప్పున, నందిగాం, నరసన్నపేట పీఎస్‌ల పరిధిలో రెండేసి చొప్పున వీరిపై కేసులు నమోదయ్యాయి. నిందితుల్లో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీసీఎస్, టెక్కలి పోలీసులను ఎస్పీ అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు, సెల్‌ఫోన్లు, నగదు

క్లుప్తంగా

17 కేజీల గంజాయితో వ్యక్తి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి ముంబైకి 17.45 కిలోల గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా నిలంద్రిచంద్రపూర్ గ్రామానికి చెందిన చాబి సాహును శుక్రవారం అరెస్ట్ చేసినట్టు ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నమ నాయుడు తెలిపారు. ముందస్తు ఒప్పందం మేరకు శుక్రవారం 17.45 కిలోల గంజాయిని ఎనిమిది ప్యాకెట్లు రెండు బ్యాగులలో సిద్ధం చేసి ఒడిశా నుంచి ఇచ్ఛాపురం తీసుకురాగా, రైల్వేస్టేషన్ వద్ద పట్టణ పోలీసులు తనిఖీలలో గర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు. తనిఖీలలో పట్టణ ఎస్ఐ ముకుంద రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఐటీఐ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగించారు. 284 మందికి గాను 128 మంది విద్యార్థులు హాజరుకాగా, అందులో 83 మంది వివిధ కళాశాలల్లో సీట్లు పొందారని జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు తెలిపారు. శనివారం 563 నుంచి 858వ ర్యాంకు వరకూ కౌన్సిలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కె.సుధ పర్యవేక్షిస్తున్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే సలహా మండలి బోర్డు సభ్యుడిగా రాజేష్



డాక్టర్ బుడుమూరు రాజేష్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజన్ సంప్రదింపుల సలహా మండలి సభ్యుడిగా ప్రముఖ విద్యా వేత్త, బీసీ నేత ప్రొఫెసర్ డాక్టర్ బుడుమూరు రాజేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, కొత్తగా రైళ్ల ప్రతిపాదన, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో సూచనలను ఈ నెల 24న జరిగే సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. రాజేష్ ప్రస్తుతం జీఎన్‌టీయూ పాలక మండలి సభ్యుడిగా, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు.

అంబులెన్సులో ప్రసవం



మగబిడ్డకు జన్మనిచ్చిన పుష్ప

మందస: టిక్కరి గ్రామానికి చెందిన నిండు గర్భిణి పుష్ప పాయకో పురిటినొప్పులతో బాధపడటంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వెంటనే మందస 108 అంబులెన్సు ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ ఎం.రామచంద్రారెడ్డిలు గ్రామానికి చేరుకున్నారు. అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో మార్గ మధ్యలోనే ప్రసవం చేయించింది. పుష్ప మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలను హరిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

సచివాలయంలో చోరీ



టెక్కలిపట్నం గ్రామ సచివాలయం

పలాస: టెక్కలిపట్నం గ్రామ సచివాలయంలో రెండు కంప్యూటర్ మానిటర్లు చోరీకి గురయ్యాయి. గురువారం రాత్రి కార్యాలయానికి తాళం వేసి శుక్రవారం ఉదయం చూసే సరికి మానిటర్లు కనిపించకపోవడంతో పంచాయతీ కార్యదర్శి రవి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సూర్యనారాయణ చెప్పారు. కాగా, వేసిన తాళం వేసినట్టుగానే ఉందని, ఇందులో కార్యాలయం సిబ్బంది హస్తం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

9న అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 9న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. నాగార్జున అగ్రికెమ్, శ్యాం పిస్టన్స్, అరబిందో, ఎస్ఆర్ఎంటీ, అపోలో టైర్స్ తదితర కంపెనీల్లో అప్రెంటిస్ కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇదేం మద్దతు?



- అరకొరగా ధాన్యం మద్దతు ధర పెంపు
- క్వింటాల్‌కు రూ.69 మాత్రమే పెంచడంపై రైతుల్లో అసంతృప్తి
- అమాంతంగా పెరిగిన సాగు ఖర్చులు

నరసన్నపేట:

కేంద్ర ప్రభుత్వం 2025–26 ఖరీఫ్ సీజన్‌కు 14 రకాల పంటలకు ఇటీవల మద్దతు ధర ప్రకటించింది. ఇందులో ప్రధాన పంట వరితో పాటు పత్తి, వేరుశనగ, నువ్వులు, సోయాబీన్, రాగి, మొక్కజొన్న, పెసలు, కంది, మినుములకు కనీస మద్దతు ధర పెంచింది. మిగిలిన పంటల ధరల సంగతి అటుంచితే వరికి ప్రకటించిన మద్దతు ధరలపై రైతులు పెదవి విరుస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విత్తనాలతో పాటు ఎరువులు, కూలీలు తదితర ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా మద్దతు ధరల పెంపులేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో వరి ప్రధాన పంట. సుమారు ఐదు లక్షల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. ధాన్యం దిగుబడి ఎకరాకు సరాసరి 25 బస్తాల వరకూ వస్తుంది. అధిక విస్తీర్ణంలో సాగు చేసే ఈ పంటకు మద్దతు ధర రూ.69 మాత్రమే పెంచడం పట్ల అన్నదాతలు అసంతృప్తిగా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న సాగు ఖర్చుల ప్రకారం బస్తాకు కనీసం రూ.200 అయినా పెంచితే బాగుంటుందని అంటున్నారు. పెంచిన ధరలను పునఃసమీక్షించాలని రైతులు కోరుతున్నారు.

సాగు ఖర్చుల భారం..

కేంద్ర ప్రభుత్వం ఏటా మద్దతు ధరలు ప్రకటిస్తూనే ఉంది. అయితే అనుకున్న మేర పెంచడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. కంటితుడుపుగా మాత్రమే మద్దతు ధరలను ప్రకటిస్తోందని, రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని అంటున్నారు. 2018–19 నుంచి ఇప్పటి వరకూ ఏటా సగటున వరి ధాన్యంపై సరాసరి రూ.100 లోపే పెంచింది. మరోవైపు సాగు ఖర్చులు ఏటా పెరుగుతూ వస్తున్నాయి. గతంలో రూ.1300 ఉండే కాంప్లెక్స్ ఎరువులు ఇప్పుడు రూ.1800కు చేరుకున్నాయి. డీజిల్, విత్తనాలు, దుక్కు ఖర్చులు, లేబరు ఖర్చులు, ఎరువులు, పురుగు మందులు ఇలా అన్ని రకాల ధరలూ భారీగా పెరిగాయి. మొత్తమ్మీద సాగు ఖర్చులు ఎకరాకు రూ.12 వేలు నుంచి రూ.16 వేలకు పెరిగాయి. దీంతో దీనికి తగ్గట్టుగా మద్దతు ధరలను పెంచాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

2018 నుంచి వరికి కనీస మద్దతు ధరలు ఇలా..

సంవత్సరం	సాధారణ రకం (రూ.లలో)	గ్రేడ్ఏ రకం (రూ.లలో)
2018–19	1750	1777
2019–20	1815	1835
2020–21	1865	1888
2021–22	1940	1960
2022–23	2020	2060
2023–24	2183	2203
2024–25	2300	2320
2025–26	2369	2389



పెరిగిన సాగు ఖర్చులు

పని	గతేడాది	ఇప్పుడు
లేబరు (ఒకరికి)	రూ.400	రూ.600
దుక్కికి (గంటకు)	రూ.900	రూ.1100
రోటావేటర్(గంటకు)	రూ.1200	రూ.1400
విత్తనాలు(30కేజీలు)	రూ.900	రూ.1140
ఉడుపు	రూ.3200	రూ.4000
ఆకుతీత(ప్యాకెట్)	రూ.1800	రూ.2300
గాబుతీత	రూ.3000	రూ.4200
కంబైండ్ హార్వెస్టర్	రూ.2600	రూ.3000

మద్దతు ధరలు పెంచాలి..



సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకోకుండా మద్దతు ధరలు ప్రకటించడం వల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇంత తక్కువ మద్దతు ధర పెంచడంతో ఏ మాత్రం లాభం లేదు. అన్ని రకాల ఉత్పత్తుల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని పునఃపరిశీలన చేసి ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించాలి.

– పోలాకి రమణయ్య, ఉర్లాం, నరసన్నపేట

గిట్టుబాటు కాదు..



నేను 20 ఏళ్లగా వ్యవసాయం చేస్తున్నా. పెరుగుతున్న సాగు ఖర్చులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలకు పొంతన ఉండటంలేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని పదేళ్ల క్రితమే ప్రకటించినా కేంద్రం మద్దతు ధరలు ఆశాజనకంగా లేకపోవడం రైతులకు నష్టాలకు గురి చేస్తుంది. వాతావరణంలో ఏమాత్రం తేడా వచ్చినా పెట్టినా ఖర్చంతా వృథాయే.

– సురంగి నర్సింగరావు, చింతువానిపేట, నరసన్నపేట

కక్షకట్టి రోడ్డున పడేశారు..!

- దౌర్జన్యంగా ఫుట్‌పాత్ దుకాణం సామాన్లు పడేసిన పంచాయతీ సిబ్బంది
- వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటమే కారణం



కోటబొమ్మాళిలో తొలగించిన ఫుట్‌పాత్ దుకాణం

టెక్కలి: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు చర్యలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. పేద, సామాన్య వర్గాలు, దళితులు వ్యాపారాలు చేసుకునే ఫుట్‌పాత్ దుకాణాలనూ వదలడం లేదు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే శుక్రవారం కోటబొమ్మాళి మెయిన్‌రోడ్‌లో ఓ ఫుట్‌పాత్ దుకాణాన్ని తొలగించి ఆ కుటుంబాన్ని నడిరోడ్డున పడేశారు. వివరాల్లోకి వెళితే..ప్రకాశ్‌నగర్ కాలనీకు చెందిన బచ్చు సంధ్య స్థానిక పాఠశాలకు ఎదురుగా ఓ టీ దుకాణం నిర్వహిస్తోంది. సుమారు 25 ఏళ్లుగా కుటుంబాన్ని పోషిస్తోంది. ఈమె వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటంతో స్థానిక టీడీపీ నాయకులు కక్ష కట్టారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తున్న ఫుట్‌పాత్ దుకాణాన్ని తొలగించేందుకు పంచాయతీ ఈఓ చింతాడ శ్రీనివాస రావు, సహాయకుడు సన్యాసిరావు, పోలీస్ సిబ్బందిని ఉసిగొల్పారు. వారు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ ఫుట్‌పాత్ దుకాణంలో సామాన్లు నడిరోడ్డున పడేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. పాతికేళ్లుగా ఎవరికీ ఇబ్బందులు లేకుండా చిన్నపాటి దుకాణాన్ని నిర్వహిస్తున్న తన కుటుంబాన్ని ఈ విధంగా నడిరోడ్డున పడేయడం తగదంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కోటబొమ్మాళిలో ఎంతో మంది ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, కేవలం తనపై మాత్రమే కక్ష కట్టారంటూ వాపోయింది. దివ్యాంగుడైన తన భర్తతో పాటు ఇద్దరు పిల్లల్ని పోషిస్తున్న తనపై ఈ విధంగా కుట్ర చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై పంచాయతీ సర్పంచ్ సంజీవరావు సైతం అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా తొలగించారని వాపోయింది.

తనయకు తలకొరివి పెట్టిన తల్లి



కేతనకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న తల్లి రాజేశ్వరి

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని ఐజే నాయుడు కాలనీకి చెందిన కాయల కాళిదాసు కుమార్తె కె.జ్యోతి(కేతన) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తండ్రి కాళిదాసు తీవ్రంగా గాయపడి జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుమార్తెకు తలకొరివి పెట్టే పరిస్థితిలో లేకపోవడంతో తల్లి రాజేశ్వరి పుట్టెడు దుఃఖంతో అంత్యక్రియలు పూర్తి చేసింది. ఈ ఘటన చూసి కాలనీవాసులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, చిన్నారి సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు కంటతడి పెట్టారు.

బాక్సింగ్ పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, కోచ్ ఉమా

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. విశాఖపట్నంలోని గాజువాక వేదికగా ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన 6వ ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్, పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో ఎస్.దేవి వరప్రసాద్ (54 కేజీల విభాగం) బంగారు పతకం, జి.సత్య భార్గవ్ (80+ కేజీల విభాగం) బంగారు పతకం , ఆర్.రామ్‌చరణ్ రెడ్డి (63 కేజీల విభాగం) రజత పతకం, పి.గణేష్ (75 కేజీల విభాగం) రజత పతకం, ఎస్.వినయ్ వరుణ్ (57 కేజీల విభాగం) కాంస్య పతకం, కె.యశ్వంత్ (46 కేజీల విభాగం) కాంస్య పతకం సాధించారు. వీరిని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బీపీ లక్ష్మణ దేవ్, వంగా మహేష్, కోచ్ ఎం.ఉమామహేశ్వర రావు, సీనియర్ బాక్సర్లు అభినందించారు.

ఎస్‌జీటీలకు కూటమి సర్కారు వెన్నుపోటు!

- మాన్యువల్‌గా కాకుండా వెబ్‌కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేసే అవకాశం

శ్రీకాకుళం న్యూకాలనీ: కూటమి ప్రభుత్వం సెకండరీ గ్రేడ్ టీచర్లకు షాక్ ఇచ్చింది. వేల సంఖ్యలో ఉండే ఎస్‌జీటీలకు ప్రభుత్వం హామీ మేరకు మాన్యువల్‌గానే బదిలీలను చేపడతామని చెబుతూ వచ్చిన అధికారులు తాజాగా వారిని షాక్‌కు గురిచేస్తూ వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీ చేస్తామని చెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, తమకు మాన్యువల్‌గా బదిలీలు జరిపేవరకు కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తామని ఎస్‌జీటీలు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా స్కూల్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ పూర్తిచేశారు. వారు వెబ్‌సైట్‌లో ఇచ్చిన ఆప్షన్ల ప్రకారం పాఠశాలలను కేటాయిస్తూ శుక్రవారం విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం (బక్రీద్) ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవ్ కావాలని, 8వ తేదీన (ఆదివారం) బదిలీ కాబడిన స్కూళ్లలో బాధ్యతలు స్వీకరించి, వెంటనే విధుల్లో చేరాలని ప్రభుత్వం పేర్కొంది.

బైక్‌తో పరారైన స్విగ్గీబాయ్

శ్రీకాకుళం క్రైమ్ : గతేడాది జనవరిలో శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు అప్పన్నమ్మ తల్లి గుడి వద్ద టెక్కలికి చెందిన ఓ వ్యక్తి బైక్ పార్కింగ్ చేసి దర్శనానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి బైక్ మాయమైంది. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బైక్‌తో పరారైంది ఓ స్విగ్గీ బాయ్ అని రూరల్ పోలీసులు ఎట్టకేలకు కనిపెట్టారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి విలేకరులకు వెల్లడించారు. రణస్థలం మండలం పాత సుందరపాలేనికి చెందిన బస్వా సుధాకరరెడ్డి (36) శ్రీకాకుళం నగరం బొందిలీపురం ఏఎస్ఎన్ కాలనీలో నివాసముంటున్నాడు. డిగ్రీ వరకు చదివి స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వ్యసనాలకు బానిసై జల్సాలకు డబ్బులు చాలక పార్కింగ్ చేసి వున్న బైక్‌లను దొంగిలించడమే నేరప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు రూరల్ ఎస్ఐ రాముకు వచ్చిన సమాచారంతో పాత్రునివలస ఫ్లైఓవర్ అండర్‌పాస్ వద్ద వాహన తనిఖీలు చేశారు. ఈలోగా బలగ నుంచి నరసన్నపేట వెళ్తున్న సుధాకరరెడ్డిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సుధాకరరెడ్డిని విచారించగా శ్రీకాకుళం టూటౌన్ పీఎస్, విశాఖపట్నం ఎయిర్‌పోర్టు పీఎస్, రూరల్ పరిధిలో మొత్తం మూడు ద్విచక్రవాహనాలు దొంగిలించినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుని వద్ద మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన రూరల్ పోలీసులను ఎస్పీ అభినందించారు.

పోలీసులకు చిక్కిన బైకుల దొంగ

- చోరీ చేసిన బైక్‌లతోనే దొంగతనాలు
- దేవాలయాలు, ఇళ్లల్లో సైతం చోరీలు
- వేలిముద్రలు ఆధారంగా నిందితున్ని పట్టుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

శ్రీకాకుళం క్రైమ్ : ఏడాది క్రితం సారవకోట మండలం బుడితిలోని ఓ నివాసలో జరిగిన చోరీలో క్లూస్ టీమ్ సేకరించిన వేలిముద్రలు ఆధారంగా జిల్లా పోలీసులు కీలక నిందితున్ని పట్టుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన కొర్ల శివ అలియాస్ మున్నా (23) విజయనగరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తుండేవాడు. స్థిరత్వం లేకపోవడంతో ఏ పనిచేసినా అక్కడ మానేసేవాడు. జల్సాలకు డబ్బులు లేకపోవడం, చెడు అలవాట్లు ఉండటంతో చోరీలు చేస్తేనే డబ్బులొస్తాయని నిశ్చయించుకున్నాడు. మున్నాకు బైక్‌లంటే పిచ్చి ఉండటంతో ముందుగా పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలను టార్గెట్‌గా చేసుకున్నాడు. కొన్ని వాహనాలను దొంగిలించాక.. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు చోరీ చేసిన బైక్‌తోనే వేరే చోటకు దొంగతనానికి వెళ్లి అక్కడికి కొద్ది దూరంలో ముందుగా తెచ్చుకున్న బైక్‌ను వదిలేసేవాడు. సమీపంలో ఉండే దేవాలయాలు, నివాస గృహాల్లో చోరీకి పాల్పడటం .. లేదంటే పార్కింగ్ చేసిన బళ్లను అక్కడి నుంచి అపహరించుకుపోవడం మున్నాకు అలవాటుగా మారింది.

పట్టుబడ్డాడిలా..

శుక్రవారం ఉదయం 10:30 గంటలకు బుడితి కమలప్రియ మోడరన్ రైస్ మిల్లు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సారవకోట పోలీసులకు నడుచుకుంటూ వస్తున్న మున్నా కనిపించాడు. పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించగా ఎస్ఐ బి.అనిల్‌కుమార్ సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. మున్నా తెచ్చుకున్న సంచిలో రెండు పాలిథిన్ కవర్లలో బంగారు, వెండి వస్తువులు గుర్తించి విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకెళ్లగా నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు విచారించారు. అప్పటికే సమాచారమందుకున్న అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస రావు, సీసీఎస్ సీఐ చంద్రమౌళిలు ఆరా తీశారు.

అనేక కేసుల్లో ముద్దాయి..

మున్నా ఫింగర్‌ప్రింట్ పరిశీలించగా ఏడాది క్రితం బుడితిలోని ఓ మహిళ నివసిస్తున్న గృహంలో జరిగిన చోరీలో మున్నాయే నిందితుడని, జిల్లాలోని అనేక పోలీస్‌స్టేషన్లలో నమోదైన 15 చోరీ కేసుల్లో ముద్దాయి మున్నానే అని పోలీసులు నిర్ధారణకొచ్చారు. ఎచ్చెర్ల పీఎస్‌లో ఐదు కేసులు, జె.ఆర్.పురం , శ్రీకాకుళం టూటౌన్, సారవకోటల్లో రెండేసి చొప్పున, జలుమూరు, లావేరు, నరసన్నపేటల్లో ఒక్కటేసి, విజయనగరం జిల్లా డెంకాడలో ఒక కేసు మున్నాపై నమోదయ్యాయి. మున్నా వద్ద నుంచి రూ.5.50 లక్షల విలువైన మూడు తులాల బంగారం , 11 తులాల వెండి, సుమారు 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సారవకోట పోలీసులను, సీసీఎస్ పోలీసులను ఎస్పీ అభినందించారు.

కూటమి ప్రభుత్వంపై పోరాటం తప్పదు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా విద్యారంగంలో పేరుకు పోయిన సమస్యలను పరిష్కారం చేయలేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో గత ప్రభుత్వం లోపాలను ఎత్తిచూపుతూ జీవో నెంబర్ 117 రద్దుచేసి పాఠశాల విద్య వ్యవస్థను సమూలంగా మారుస్తానని హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక జీవో నెంబర్ 19, 20, 21 తీసుకొచ్చి ఉన్న పాఠశాలలను మూసివేసే కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం పథకాలు అమలు కాక విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టుల్ని తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోవతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఈ.చందు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారి స్వయం భూలింగం



కొట్నం దంపు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ ఉత్సవం ఘనంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. ముత్తయిదువులు కొట్నం దంపు కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులను నంది వాహనంపై ఉంచి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు హారతిలిస్తూ పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈఓ పి.ప్రభాకరరావు ఎంపీటీసీ కె.హరిప్రసాద్, సర్పంచ్ టి.సతీష్‌కుమార్ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు, తెలుగు ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీల్లో తెలుగు ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని డీటీఎఫ్, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లాశాఖ నాయకులు ఆరోపించారు. తప్పనిసరి బదిలీలు, రీ–అప్పోర్షన్‌కు గురైన తెలుగు ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీనియారిటీ ర్యాంకు తర్వాత పెట్టిన పాఠశాలలకు బదిలీ అయినట్లు ఆర్డర్లు రావడంతో శుక్రవారం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. వాస్తవానికి సీనియారిటీ నెంబర్‌కు ముందు ఉన్న పాఠశాలలకు మాత్రమే బదిలీ కావాల్సి ఉందన్నారు. ఈ మేరకు డీఈఓ తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేశారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



వైద్యులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం: జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరో ముందడుగు పడిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం రిమ్స్‌కు బోయింగ్ ఇండియా సంస్థ (సీఎస్ఆర్) ద్వారా సమకూర్చిన రూ.45 లక్షల విలువైన వైద్య పరికరాలను కేంద్రమంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం రిమ్స్ ఆసుపత్రి, కళాశాల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, బోయింగ్ ఇండియా వైద్యులు ప్రవీణ్, రంజిత్, అమృత, రోహిత్, జీజీహెచ్, రిమ్స్ వైద్యుడు మురళీకృష్ణ, సూపరింటెండెంట్ డాక్టర్ అమూల్య, జైన్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మూగజీవులు మృతి



మృతి చెందిన ఆవు



మృతి చెందిన మేకలు

సారవకోట: రామకృష్ణాపురంలో సాధు అప్పలనాయుడుకు చెందిన ఆవు శుక్రవారం పిడుగుపాటుకు గురై మృతి చెందింది. సుమారు రూ.60 వేలు విలువైన ఆవు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

పిడుగుపాటుకు రెండు మేకలు మృతి

బూర్జ: లచ్చయ్యపేటలో దాసరి తాతారావు, దాసరి నీలం, దాసరి అసిరినాయుడులకు చెందిన మేకలు పిడుగుపాటుకు గురై మృత్యువాతపడ్డాయి. ఉప్పినివలస గ్రామ పరిసరాలలో మేత మేస్తుండగా శుక్రవారం సాయంత్రం పిడుగు పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. విషయాన్ని గుత్తావల్లి పశువైద్యాధికారి డాక్టర్ సువ్వారి కరుణ దృష్టికి తీసుకెళ్లారు.

ఇంటిపై పిడుగు

టెక్కలి రూరల్: స్థానిక గోపినాథపురం సమీపంలో హనుమంతువీరన్నగారి వీధిలో సత్తారు ధర్మారావు అనే వ్యక్తి ఇంటిపై శుక్రవారం సాయంత్రం పిడుగు పడింది. ఈ ఘటనతో గోడలు బీటలు వారి కింద ఉన్న కారుషెడ్ మరమ్మతులకు గురైంది. పలు విద్యుత్ గృహోపకరణాలు పాడయ్యాయి.

తీరప్రాంతంలో జాగ్రత్త



పోతయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరికృష్ణరావు

రణస్థలం: సముద్ర తీరం వెంబడి ఉగ్రవాదులు, ఇతర దేశాలకు చెందిన వ్యక్తుల వచ్చినప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణరావు అన్నారు. రణస్థలం మండలం పాతయ్యపేట, గురయ్యపేట, చీకటిపేట, దోనిపేట గ్రామాల్లో శుక్రవారం మత్స్యకారులకు అవగాహన కల్పించారు. తీరంలో అనుమానాస్పదంగా కనిపిస్తే 1093 గానీ, 93929 14712 నంబర్‌కు గానీ తెలియజేయాలని కోరారు.

క్లుప్తంగా

డీపీవోలో పోలీస్ వెల్ఫేర్ డే



సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీసు శాఖలో పలు హోదాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ వకుల్ జిందల్ డీపీవోలో పోలీసు వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వినతులు పరిశీలించిన ఎస్పీ త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని సిబ్బంది, అధికారులకు భరోసా ఇచ్చారు.

బొబ్బిలి విద్యార్థులకు జాతీయ పతకాలు



గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

బొబ్బిలి: ఒడిశాలోని కటక్ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో మే 30 నుంచి మూడు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బొబ్బిలి క్రీడాకారులు జాతీయ పతకాలు సాధించినట్టు కోచ్ సుధాకర్‌యాదవ్ తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది పాల్గొన్న ఈ పోటీల్లో బొబ్బిలికి చెందిన 17 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీలలో గెలుపొందారన్నారు. బంగారు పతకాలు ముగ్గురికి, కాంస్య పతకాలు 9 మందికి, వెండి పతకాలు ఐదుగురికి లభించాయన్నారు. వీరిలో జ్ఞానదీపక్ తన ప్రత్యర్థిపై రెండు రౌండ్లలోనూ 16-0, 13-0 స్కోర్లతో గొప్ప విజయం సాధించినట్టు చెప్పారు. జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే బేబీ నాయన, డీఎస్పీ జి.భవ్యా రెడ్డి అభినందించినట్టు చెప్పారు.

తేనేటీగల దాడిలో పలువురికి గాయాలు



క్షతగాత్రులకు చికిత్సనందిస్తున్న 108 ఈఎంటీ ఈశ్వరరావు

రేగిడి: మండల పరిధి కొమెర వెంకటాపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులుపై తేనేటీగలు శుక్రవారం దాడి చేశాయి. కాలువల్లో పనులు చేస్తుండగా తుప్పలకు ఉన్న తేనెటీగలు దాడి చేయడంతో వేతనదారులు పరుగులు తీశారు. అప్పటికే పలువురి వేతనదారులు తీవ్రంగా గాయపడడంతో ఫీల్డ్ అసిస్టెంట్ రేగిడి రమణ 108కు సమాచారం అందించారు. రేగిడి, పాలకొండ 108 సిబ్బంది రెండు వాహనాల ద్వారా గ్రామానికి చేరుకుని దాడిలో గాయపడిన బట్న జగన్నాథం, ఇందిరాపు రత్నాలమ్మ, వెంపటాపు సూర్యనారాయణ, బట్న రాజేష్, అరసవిల్లి గౌరమ్మ, అరసవల్లి దుర్గారావులతో పాటు మరి కొందరిని ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, పైలెట్ జి.నారాయణరావు, వెంకటరమణలు పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జిల్లా కేంద్రంలో రెండు చోట్ల చోరీ



సీసీ కెమెరాలో రికార్డు అయిన చోరీ దృశ్యాలు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో కొత్తవలస ఫ్లెటోవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న శ్రీరంగ మోటార్ మహేంద్ర ట్రాక్టర్ షోరూం, శ్రీ వాసవీ లారీ యూనియన్ కార్యాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్టు పట్టణ ఎస్ఐ జగదీష్‌నాయుడు శుక్రవారం తెలిపారు. ఈ చోరీ ఘటనలో ట్రాక్టర్ షోరూంలో రూ.80వేల నగదు అపహరించినట్టు తెలిపారు. దుండగలు ముందు లారీ యూనియన్ కార్యాలయంలో చోరీకి పాల్పడినట్టు అక్కడ ఏమీ లేకపోవడంతో పక్కనే ఉన్న ట్రాక్టర్ షోరూంలోకి వెనుక భాగం నుంచి ప్రవేశించి చోరీకి పాల్పడినట్టు పేర్కొన్నారు. బాధితుడు బోటు గంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరిస్తున్నామని, చోరీకి పాల్పడిన ఇద్దరు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్టు తెలిపారు.

పసుపు సాగుకు సమయమిదే..!

- జిల్లాలో వెయ్యి ఎకరాల వరకు సాగు
- విత్తనశుద్ధి తప్పనిసరి
- విత్తన ఆదా ముఖ్యం
- నాటే విధానంలో జాగ్రత్తలు పాటించాలి

సీతంపేట: జిల్లాలో నాణ్యమైన పసుపు దిగుబడికి సీతంపేట ఏజెన్సీ పెట్టింది పేరు. ఇక్కడ పండిన పసుపునకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. జిల్లాలో దాదాపు వెయ్యి ఎకరాల్లో పసుపు పంట సాగులో ఉండగా సీతంపేట ఏజెన్సీలోనే కొండ పోడు వ్యవసాయంలో 650 ఎకరాల్లో సాగవుతుంది. గిరిజనులు ప్రతీ ఏటా సాగును పెంచుతున్నారు. ఈ క్రమంలో పసుపు సాగుకు ఈ నెలలోనే అనువైన సమయమని హార్టీకల్చర్, వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. తగు జాగ్రత్తలు పాటిస్తే పసుపు బంగారమే అవుతుందంటున్నారు. పసుపు పంట సాగు దశలో ప్రధానంగా విత్తన ఎంపిక కీలకమైంది. ఈ విత్తనాన్ని ఎన్నుకునేటప్పుడు తెగుళ్లు, చీడపీడలు లేని నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలి. ఖరీఫ్‌దైన పంటలను సీజన్‌లో సమయానికి వేయకపోతే దుంపపై ఆ ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏజేన్సీలో ఆధికంగాను, మిగిలిన మండలాల్లో తక్కువ విస్తీర్ణంలోను పసుపు సాగు చేస్తారు. దీని సాగుకు ఈ నెల చివరి వరకు సరైన ఆదును సమయం. జూలై నెలలో పసుపు సాగు చేస్తే బాగా దిగుబడి తగ్గిపోతుంది. దీంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదు.



ఏజెన్సీలో పసుపు పంట(ఫైల్)

నాటే విధానంలో జాగ్రత్తలు పాటించాలి

పసుపు విత్తనాన్ని మూడు రకాల పద్ధతుల్లో నాటుకోవచ్చు. ఇందులో ఎత్తుమడుల పద్ధతి, సమతల పద్ధతి, బోదే పద్ధతి. ఎత్తుమడుల పద్ధతిలో మీటరు వెడల్పు కలిగిన కయ్యల్లో 30 సెంటీమీటర్ల వెడల్పు కలిగిన బోదెలు ఉండేలా చుసుకోవాలి. అదే విత్తన ఉంటను 15 సెంటీమీటర్ల ఎడమతో పూడ్చుకోవాలి. పసుపు పంటకు సోకే తెగుళ్లలో దుంప కుళ్లు, ఆకుమచ్చ తెగుళ్ల వేరు వ్యవస్థ ద్వారా వ్యాపిస్తాయి. విత్తన శుద్ధి చేయకుండా కొమ్మలను ఉంటలను పూడ్చకూడదు. పొలంలోని మురుగు నీరు బయటకు వెళ్లిపోయేలా చేసుకోవాలి. మొక్కల చుట్టూ నీరు నిల్వ లేకుండా చేయాలి. పొటాష్ ఎరువులను సక్రమంగా వేయకపోవడం వల్ల ఇవి వ్యాప్తిస్తాయి. దీనికి మూల కారణం విత్తన శుద్ధి తప్పక చేయాలి.

ఎంత విత్తనం వేయాలంటే..

విత్తనం ఎకరానికి కాడి రకం సాధారణంగా ఏజెన్సీలో 6 పుట్లు (పుట్టి 300 కిలోలు) 1800 కిలోలు వేస్తారు. కొంత మంది రైతులు 5 పుట్లు కూడా విత్తనంగా వేస్తారు. ఆయా పరిస్థితులను బట్టి విత్తనంగా వేసుకోవాల్సి ఉంటుంది. కొత్త పద్ధతులు ఆమలులో ఉన్నాయి. విత్తనంలో కనుపు వద్ద విరిచి చిన్న ముక్కలుగా చేసుకుని విత్తనంగా వేసుకోవచ్చు. దీంతో విత్తనం ఆదా కావడంతో పాటు రైతుకు ఖర్చు కూడా తగ్గుతుంది. పసుపు పంట సాగుకు బలమైన నేలలు శ్రేష్టమైనవి. నల్ల, బంక నేలల్లో పసుపు సాగు చేయవచ్చు. గరప, చౌడు నేలలు పనికిరావు.

జాగ్రత్తలు పాటించాలి

పసుపు పంటకు అధికంగా ఎరువుల వినియోగించకూడదు. దీని వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదు. దుక్కి దున్నే సమయంలో ఎకరాకు 3 బస్తాల సూపర్ పాస్ఫేట్, 200 కిలోల వేప పిండి, 25 కిలోల పొటాష్‌ను వేయాలి. ఆ తర్వాత విత్తనం పూడ్చిన 40 రోజులకు ఒక బస్తా యూరియా వేయాలి. మూడవ విడత 80 రోజులకు బస్తా యూరియా, 25 కిలోల పొటాష్, 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. నాలుగో విడత 120 రోజులకు బస్తా యూరియా, 25 కిలోల పొటాష్ వేస్తే సరిపోతుంది. ఇలా శాస్త్రీయ పద్ధతిలో ఎరువులను వేయడం వల్ల ఎకరానికి రూ.8 వేల వరకు పెట్టుబడి తగ్గుతుంది.

విత్తనశుద్ధి తప్పనిసరి

విత్తనాన్ని పొలంలో నాటే ముందు లీటరు నీటిలో మూడు గ్రాముల కార్బండిజమ్ లేదా డైథేన్ ఎం-45ను కలిపిన ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. విత్తనం ఉంటైనా, కొమ్మైన 40 నిమిషాలు ఈ ద్రావణంలో నానబెట్టాలి.

విత్తనాన్ని డ్రమ్ము నుంచి బయటకు తీసి నీడలో ఆరబెట్టాక ఆ తర్వాత విత్తనం పూడ్చాలి. శిలీంధ్ర నాశని వల్ల వచ్చే తెగుళ్ల నివారణకు మూడు మిల్లీ లీటర్ల డైమిథోయేట్ ద్రావణంలో ట్రికో డెర్మావిరిడి పొడి 3 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసుకుంటే తెగుళ్లను చాలా వరకు నివారించవచ్చు.

ఆకులను మల్చ్‌గా ఉపయోగించాలి



పంట విత్తిన వెంటనే హెక్టార్‌కు 12-15 టన్నుల పచ్చని ఆకులను మల్చ్‌గా ఉపయోగించాలి. కలుపు తీయడం,భూమిని పైకెత్తి, నాటి న 40-90 రోజుల తర్వాత హెక్టార్‌కు 7.5 టన్నుల చొప్పున మల్చింగ్ పునరావృతం చేయాలి. పసుపును రైజోముల ద్వారా వ్యాప్తి చేస్తారు. ఒక ఎకరం భూమిలో నాటడానికి వెయ్యి కిలోల రైజోముల విత్తన రేటు అవసరం.

– పి.జయశ్రీ, ఉద్యానవనశాఖ అధికారి, సీతంపేట

88 గ్రామాల్లో కుటుంబ సర్వే చేయాలి : పీవో

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని 88 గిరిజన గ్రామాల్లో కుటుంబ సర్వే చేయాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. వివిధ మండలాలకు చెందిన మండల స్థాయి అధికారులతో శుక్రవారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ తప్పుల సవరణ, భూమి పట్టాలు ఉన్నాయా లేదా, ఉంటే కరెక్షన్ ఏమైనా చేయాలా?, కుల ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువపత్రం వంటివి తీసుకోవాల్సినవి పెండింగ్‌లో ఉన్నాయనేది సర్వే చేయాలన్నారు. ఎంతమంది ఇంట్లో ఉంటున్నారు, వారి జీవన విధానం తదితర వివరాల సర్వే ఈ నెల 13వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి నెలాఖరు వరకు అన్ని శాఖలకు చెందిన అధికారులు గ్రామాల్లో క్యాంపయిన్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

టీడీపీ కీచకులను శిక్షించాలి : డీబీఎస్‌యూ

శృంగవరపుకోట: సభ్య సమాజం తలదించుకునేలా ఒక దళిత మైనర్ బాలికను చెరపట్టి ఆర్నెళ్ల పాటూ అత్యాచారానికి పాల్పడ్డ కీచకులను ఉరి తీయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి జయశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో ఏడుగుర్రాలపల్లిలో టీడీపీ మూకలు దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేసి, వీడియోలు ఉన్నాయంటూ బెదిరించి ఆమెపై ఆర్నెళ్ల పాటూ 14మంది ఒకరి తర్వాత ఒకరుగా అత్యాచారం చేస్తూ, గర్భవతిని చేసి, బాధితురాలిని బెదిరించి గ్రామం నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయేలా చేసిన దుశ్చర్య రాష్ట్రానికి, అధికార తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు సిగ్గుచేటు అన్నారు. దుశ్చర్యకు పాల్పడ్డ రౌడీ మూకలపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత కుటుంబాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే ప్రభుత్వ పెద్దలు మౌనం దాల్చటం సరికాదన్నారు. ప్రభుత్వం పెదవి విప్పకుంటే దళిత సమాజం, సంఘాలు నిజాల నిగ్గు తేల్చేందుకు ఉద్యమిస్తాయని స్పష్టం చేశారు.

పెళ్లిరోజు ప్రియుడితో యువతి పరార్

విజయనగరం క్రైమ్:

సరిగ్గా పెళ్లి జరగాల్సిన రోజు ప్రియుడితో యువతి పరారైంది. దీనిపై యువతి తల్లి శుక్రవారం విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని వీటీ అగ్రహారానికి చెందిన ఓ దుకాణంలో పనిచేసిన సమయంలో నగరంలో నివసిస్తున్న యువతీ, యువకుడి మధ్య ప్రేమ చిగురించింది. కొన్నాళ్లుగా కలిసి తిరిగారు. విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో ఈ నెల 5వ తేదీన మేనమామతో పెళ్లిచేయాలని ముహూర్తం ఖరారు చేశారు.

విశాఖపట్నం సింహాచలంలోని అప్పన్న స్వామి సన్నిధిలో పెళ్లి జరగాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ప్రియుడు ఐదు రోజుల కిందట ప్రియురాలి ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. దీనిపై యువతితో పాటు బంధువులు పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు కూడా చేశారు. ఏమైందో తెలియదు.. పెళ్లి జరగాల్సిన 5వ తేదీనే ప్రియుడితో కలిసి యువతి పరారైంది. ఇద్దరూ మేజర్లు కావడంతో యువతి తల్లి నాగమణి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ అశోక్ తెలిపారు.

పిడుగుపాటుకు గురై మహిళ మృతి



పిడుగుపడి మృతి చెందిన పూడివలస వెంకటమ్మ

తెర్లాం: పిడుగు పాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన తెర్లాం మండలం విజయరాంపురం ఉరఫ్ బూరిపేట గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్తులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలు.. విజయరాంపురం గ్రామానికి చెందిన పూడివలస వెంకటమ్మ(40) పిడుగు పాటుకు గురై మృతి చెందింది. శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో వెంకటమ్మ పశువులకు దాణా పెట్టేందుకు పశువులశాలకు వెళ్లింది. ఆ సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పశువుల శాల పక్కనే పడడంతో పశువుల శాలలో ఉన్న వెంకటమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతిరాలికి భర్త రామిశెట్టి, ఇద్దరు వివాహితులైన కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె కామేశ్వరికి గతంలో వివాహం జరగగా, 10 రోజుల క్రితమే చిన్న కుమార్తె గౌరీశ్వరికి వివాహమైంది. అంతవరకు ఇంట్లో ఉండి పశువులకు దాణా పెట్టి వస్తానని చెప్పి పశువుల శాలకు వెళ్లిన వెంకటమ్మ పిడుగుపాటుకు గురై మృతి చెందిందన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు గ్రామ సర్పంచ్ బూరి మధుసూదనరావు సమాచారం ఇవ్వగా వెంటనే తహసీల్దార్ గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని, మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. తెర్లాం ఏఎస్ఐ భాస్కరరావు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

పాము కాటుకు గురై వ్యక్తి..



ఏగిరెడ్డి లక్ష్మునాయుడు(ఫైల్)

తెర్లాం: పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన తెర్లాం మండలం సింగిరెడ్డివలస పంచాయతీ బొంగుపేట గ్రామంలో జరిగింది. దీనికి సంబంధించి తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు శుక్రవారం తెలిపిన వివరాలు.. బొంగుపేట గ్రామానికి చెందిన ఏగిరెడ్డి లక్ష్మునాయుడు(59) పాము కాటుకు గురై మృతి చెందాడు. బుధవారం రాత్రి కళ్లానికి వెళ్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజాంలోని సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్య సేవల నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు లక్ష్మునాయుడుకి సత్యవతి, వివాహితులైన పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆసుపత్రిలో శవ పంచనామా చేసి అక్కడే పోస్టుమార్టం చేయించారు.

జ్వరంతో వ్యక్తి..

సీతంపేట: మండలంలోని జగతపల్లి గ్రామానికి చెందిన సవర ఆనందరావు (26) అనే గిరిజనుడు జ్వరం, వాంతులు, విరేచనాలు, ఆయాసంతో బాధపడుతూ పాలకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆనందరావు రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా గురువారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాలకొండ ప్రైవేటు ఆసుపత్రికి శుక్రవారం ఉదయం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య మేఘన, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దినేష్



దినేష్ (ఫైల్)

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చింతల బెలగాం దాటి పరసపాడు గ్రామ సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చినమేరంగి గ్రామానికి చెందిన ముదిలి దినేష్(26) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... దినేష్ తన భార్య దివ్యతో బయటకు వెళ్లి వస్తానని గురువారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై బయలుదేరాడు. పరసపాడు సమీపంలో ముందు టేకు కర్రలతో వెళ్తున్న నాటుబండిని ఢీకొని పడిపోయాడు. స్థానికులు 108లో పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దినేష్‌కు భార్య దివ్య, మూడేళ్ల కుమార్తె దీక్షితశ్రీ ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.అనీష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా టేకు కర్రలతో వెళ్తున్న బండికి వెనుక భాగాన ప్రమాద సూచిక ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

పాలకొండ రూరల్: కుటుంబ పోషణకు రైతు వారీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న సన్నకారు రైతు పొలం నుంచి ఇంటిబాట పడుతున్న క్రమంలో విధి వక్రించింది. రోడ్డు దాటుతున్న క్రమంలో ద్విచక్ర వాహన రూపంలో మృత్యువు కబలించింది. ఎస్ఐ కె.ప్రయోగమూర్తి తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. గోపాలపురం గ్రామానికి చెందిన గర్భాన లక్ష్మం (62) ఉపాధి పనులతో పాటు పొలం పనులు పూర్తి చేసుకుని శుక్రవారం సాయంత్రం ఇంటికి వస్తున్నారు. గ్రామ సమీపంలో రోడ్డు దాటుతుండగా పాలకొండ నుంచి రాజాం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యాకుల రఘు తన వాహనంతో లక్ష్మంను ఢీకొన్నాడు. తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రుడిని స్థానికులు పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మం మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న భార్య అన్నపూర్ణ, ముగ్గురు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విశాఖ రైల్వేజోన్‌పై గెజిట్ ప్రకటించాలి

విజయనగరం గంటస్తంభం: విశాఖ రైల్వే జోన్ జీఎంగా సందీప్ మాథుర్‌ను నియమించడాన్ని లోక్‌సత్తా పార్టీ హర్షిస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం వస్తున్న సందర్భంగా కొత్త రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటి నుంచి ప్రారంభం అవుతాయో తెలిపే గెజిట్‌ను ప్రకటిస్తే బాగుంటుందన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు 15 నుంచి రైల్వే జోన్ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు.

వజ్రోత్సవ సంబరానికి..


వీరఘట్టం హైస్కూల్ ముస్తాబు

- ఈ నెల 8న చదువులమ్మ ఒడిలో సాగనున్న వజ్రోత్సవ పండగ
- తరలివస్తున్న 52 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు
- వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ స్థాపించి 75 ఏళ్లు పూర్తి
- విదేశాల నుంచి ఒకొక్కరికిగా చేరుకుంటున్న విద్యార్థులు
- హైస్కూల్‌కు 5 ఎకరాల స్థలాన్ని ఇచ్చినదాత రౌతు చిన్నంనాయుడు విగ్రహ ప్రతిష్టకు సన్నాహాలు



వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల


వీరఘట్టం: వజ్రోత్సవ సంబరాలకు వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్తాబవుతోంది. 1950లో స్థాపించిన ఈ పాఠశాల ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. 75 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారు. దేశవిదేశాల్లో వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణిస్తున్నారు. తమ ఉన్నతికి అక్షర పునాది వేసిన పాఠశాల ఒడిలో మిత్రులు, గురువులను కలిసేందుకు విద్యార్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 8న ఆదివారం వజ్రోత్సవ వేడుకల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాల స్థాపించినప్పటి నుంచి ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు, ఆఫీస్ సిబ్బంది సుమారు 300 మందిని సత్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 1950లో ఇక్కడ హైస్కూల్ స్థాపించడానికి 5 ఎకరాల స్థలం (ప్రస్తుత విలువ రూ.30 కోట్లు) ఉచితంగా అందజేసిన కత్తులకవిటి గ్రామానికి చెందిన దివంగత రౌతు చిన్నంనాయుడు విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ఆయన మనవడు, ప్రస్తుత హైకోర్టు న్యాయమూర్తి రౌతు సురేష్‌కుమార్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ డైమండ్ జూబ్లీలో తమ బాల్య మిత్రులను కలుసుకునేందుకు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసేందుకు అమెరికా, లండన్, బ్యాంకాక్, సింగపూర్ తదితర దేశాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు రానుండడంతో సంబరాలు అంబరాన్ని తాకనున్నాయి. 1969లో రిలీవ్ అయిన మొదటి పదో తరగతి బ్యాచ్‌తో పాటు 2020లో రిలీవైన టెన్త్ బ్యాచ్ వరకు 52 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొననున్నట్టు పూర్వ విద్యార్థి బెహరా ప్రసాద్ తెలిపారు.



ఈనెల 8న జరగనున్న వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం చేస్తున్న వేదిక

హైస్కూల్‌లో పండగ వాతావరణం

వజ్రోత్సవ వేడుకల ఏర్పాట్లు వారం రోజులుగా జరుగుతుండడంతో పండగ వాతావరణం నెలకొంది. ఇక్కడ పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన, బదిలీపై వెళ్లినపోయిన ఉపాధ్యాయులందరికీ పూర్వ విద్యార్థులు ఆహ్వాన పత్రికలు పంపించారు. అలాగే అన్ని బ్యాచ్‌ల నుంచి సుమారు 1500 మందల మంది పూర్వవిద్యార్థులు వస్తున్నట్టు సమాచారం. ఉత్సవ నిర్వహణకు తమవంతు సహాయంగా సుమారు రూ.12 లక్షలకు పైగా విరాళాలను ఇచ్చారు. ఉదయం టిఫిన్ నుంచి మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, స్నాక్స్‌ను అందరికీ అందించేందుకు ఆర్గనైజింగ్ కమిటీలో ఉన్న పూర్వ విద్యార్థులు ఏర్పాట్లు చేశారు.



విశ్రాంత ఉపాధ్యాయుడికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న పూర్వ విద్యార్థులు

ఎన్నాళ్లో వేచిన సమయం..

వజ్రోత్సవ వేడుకల కోసం ఎన్నాళ్లో వేచిన సమయం ఈ నెల 8న రానుండడంతో ప్రతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన మాస్టార్లను విడివిడిగా సత్కరించేందుకు ఎవరి ఏర్పాట్లు వారు చేసుకుంటున్నారు. వారితో గ్రూప్ ఫోటోలు దిగేందుకు ప్రత్యేకంగా కెమెరామెన్‌లను బుక్‌చేసుకున్నారు. తమ బ్యాచ్ వారు ఒకరిని ఒకరు గుర్తు పట్టేందుకు ప్రత్యేక కలర్ కోడింగ్ ఉన్న దుస్తులు కూడా ధరించనున్నారు. 14 ఏళ్ల వయస్సులో పదో తరగతిలోని క్లాసు రూమ్‌లో చేసిన అల్లర్లు, స్నేహితులతో తిరిగిన పాఠశాల ప్రాంగణం, వీరఘట్టం పరిసర ప్రాంతాలను చూసేందుకు దేశ విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు రానుండడంతో వీరందరికీ స్వాగతం పలికేందుకు ఉత్సవ కమిటీ సర్వం సిద్ధం చేస్తోంది.



ప్రతిష్టకు ముస్తాబవుతున్న హైస్కూల్ స్థలదాత చిన్నంనాయుడు విగ్రహం

ఇవే పార్కింగ్ స్థలాలు....

వజ్రోత్సవ వేడుకలకు కార్లు ఇతర వాహనాలపై వచ్చే వారు తమ వాహనాలను తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు, హైస్కూల్ ఎదురుగా ఉన్న స్థలంలో లేదా, బాలికల పాఠశాల పక్కనే ఉన్న లే-అవుట్‌లలో పార్కింగ్ చేసుకోవాలని ఎస్ఐ జి.కళాధర్ సూచించారు. ఆయన వజ్రోత్సవ వేడుకల ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలను శుక్రవారం పరిశీలించారు. వజ్రోత్సవ పండగ ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగేలా చూసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు.